క్లుప్తంగా

కూరగాయల అందజేత



శ్రీకాళహస్తికి కూరగాయల వాహనాన్ని పంపుతున్న ప్రసాద్ దంపతులు

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి జ్ఞానప్రసూనాంభ సమేత శ్రీకాళాస్తీశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా కూరగాయలను ఉచితంగా అందజేస్తున్నట్లు స్థానిక కూరగాయల వ్యాపారి ప్రసాద్, ఆదిలక్ష్మి దంపతులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏటా 25 టన్నుల కూరయలను దేవస్థానం నిర్వహించే అన్నదాన కార్యక్రమం కోసం ఇక్కడి నుంచి పంపుతున్నామన్నారు. అలాగే శ్రీ మహానందీశ్వర స్వామి దేవస్థానం నిర్వహించే అన్నదానం కార్యక్రమానికి 19 సంవత్సరాలుగా కూరగాయలను విరాళంగా ఇస్తున్నామని చెప్పారు. లక్కబోయిన దిలీప్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

16న ఓపెన్ డే

శిరివెళ్ల: ఈ నెల 16వ తేదీన కళాశాలలో ఓపెన్ డే నిర్వహిస్తున్నట్లు యర్రగుంట్ల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల పెంపు కోసం ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కళాశాల సమీపంలోని మోడల్ స్కూల్, దీబగుంట్ల, యర్రగుంట్ల జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులలు, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కళాశాలలో ఉన్న వివిధ కోర్సులు, లైబ్రరీ, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, జేకే నాలెడ్జి వంటి సదుపాయాలను విద్యార్థులకు వివరిస్తామని పేర్కొన్నారు. కళాశాలలో ప్రస్తుతం చదువుతున్న తమ విద్యార్థులతో ఇంటర్ విద్యార్థులకు ముఖాముఖి కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామని వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



పూర్ణతేజేశ్వరరెడ్డి

ఉయ్యాలవాడ : మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి బొమ్మిరెడ్డి పూర్ణతేజేశ్వరరెడ్డి జాతీయ స్థాయి బాల్ బ్యాండ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవగౌడ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మాయలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్–14 బాల్‌బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ విభాగంలో ఈ నెల 16న తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొనన్నుట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు సుదర్శనరావు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

వడ్డెరులు అన్ని రంగాల్లో రాణించాలి

నంద్యాల(అర్బన్): వడ్డెరులు రాజకీయ, ఆర్థిక, సామాజికాభివృద్ధి సాధించాలని ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా వెంకటేష్ తెలిపారు. స్థానిక కార్యాలయ ఆవరణంలో సోమవారం వడ్డెర సంఘీయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో వడ్డెర సంఘం కమిటీలను ఏర్పాటు చేసి వారిలో చైతన్యం తెస్తామన్నారు. వృత్తి పరంగా విద్యా, ఉద్యోగ అవకాశాల్లో వడ్డెరులకు ప్రభుత్వాలు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. నాయకులు నాగసుబ్బరాయుడు, రామసుబ్బయ్య, మహేష్, జంబులయ్య పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టండి

దొర్నిపాడు: మండలంలో ఎస్‌డీజీ (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) సర్వేను పకడ్బందీగా, తప్పులేకుండా పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగఅనసూయ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యలయంలో మహిళా పోలీస్, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సర్వేపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిల్‌లో వెళ్లి, గర్భిణులు, 0–5 ఏళ్ల చిన్నారుల వివరాలు, 6–19 వయస్సు గల వారి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. వెంటనే ఫార్మట్ ప్రకారం సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఏఎస్ఓ దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

గడువులోపు ఈ-క్రాప్ నమోదు పూర్తిచేయాలి

దొర్నిపాడు: రబీలో సాగుచేసిన పంటలను గడువులోపు ఈ–కేవైసీ పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక కార్యలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ అనంతరం వెంటనే ఈ–కేవైసీ చేయించాలని ఆదేశించారు. అలాగే పెట్టుబడి సాయం కింద అందిస్తున్న పీఎం కిసాన్ పథకానికి 82 మందికి సంబంధించిన బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ నంబర్ అనుసంధానం కాలేదని, వారికి వెంటనే స్థానిక పోస్టాఫీసుల్లో ఐపీపీబీ ఖాతాను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే 1,262 మంది రైతులు పీఎం కిసాన్‌కు ఫార్మర్ ఈ–కేవైసీ చేయించుకోలేదని, వెంటనే సీఎస్‌ఎస్ కేంద్రాలకు వెళ్లేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

చెరువులు నిండుగా..పంటలు పచ్చగా

- నేటికీ అలుగు పారుతున్న రూపనగుడి చెరువు
- 600 ఎకరాల్లో పంటల సాగు
- నీరు సమృద్ధిగా లభిస్తుండటంతో రైతుల సంతోషం



అలుగు పారుతున్న దృశ్యం



నిండుకుండలా రూపనగుడి చెరువు



చెరువు పరిధిలో సాగు చేసిన మొక్కజొన్న పంట

ఉయ్యాలవాడ : మండలంలోని రూపనగుడి, తుడుమలదిన్నె చెరువులకు ఎస్సార్బీసీ నుంచి నీరు వచ్చి చేరుతుండటంతో ఫిబ్రవరి ముగుస్తున్నా నిండుకుండలను తలపిస్తున్నాయి. సాధారణంగా డిసెంబర్ వరకు చెరువులు నీటితో కళకళలాడుతుంటాయి. ఫిబ్రవరి చివరి నాటికి నీరు తగ్గుముఖం పట్టేవి. అయితే ప్రస్తుతం కూడా అలుగు పారుతుండటంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల పరిధిలోని గోవిందపల్లె, తుడుమలదిన్నె, మాయలూరు, పుచ్చకాయలపల్లె గ్రామాల్లో భూగర్భ జలాలు పెరగడంతో బోరు బావుల్లో నీరు సమృద్ధిగా వస్తుండటంతో వేసవిలో తాగునీటి సమస్య తెలెత్తే అవకాశం లేదని ఆయా గ్రామాలు ప్రజలు పేర్కొంటున్నారు. రెండు చెరువుల పరిధిలో 600 ఎకరాలు ఆయకట్టు ఉండగా 100 ఎకరాల్లో రెండో పంటగా వరి సాగు చేశారు. మిగిలిన 400 ఎకరాల్లో ఆరుతడి పంటలు మిరప, కంది, మొక్కజొన్న, సోయాబీన్ తదితర పంటలు సాగు చేశారు. నీరు పుష్కలంగా పారుతుండటంతో పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి.

నీటి సమస్య లేదు



చెరువుల పరిధిలో ఆయకట్టు భూములకు సాగు నీరు అందుతుండడంతో నీటి ఇబ్బందులు లేవు. నాకున్న రెండు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలు ఎకరాకు రూ. 25 వేలు చెల్లించి కౌలుకు తీసుకుని మిరప, మొక్కజొన్న పంటలు సాగు చేశా. పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. చెరువులో నీరు సమృద్ధిగా ఉండటంతో మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నా.

– తలారి ఓబులేస్, రైతు, తుడుమలదిన్నె

వేధింపుల కేసు నమోదు

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన నాగేంద్ర అనే వ్యక్తి వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 9న మహిళ తన పొలంలో పనులు చేసుకుంటుండగా నాగేంద్ర దాడి చేసి, అసభ్యకర పదజాలంతో దూషించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొందని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి

రుద్రవరం: మండలంలోని కోటకొండ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామంలో పర్యటించినప్పుడు పలు కాలనీల వాసులు సీసీ రోడ్లు వేయించాలని కోరారు. స్పందించిన ఆయన ప్రభుత్వం నుంచి రూ.20లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో సర్పంచు దేగాని వెంకటేష్ ఐదు కాలనీల్లో సీసీ రోడ్లు వేయించారు. ఆ పనులు సోమవారం ముగిశాయి. అలాగే అదనంగా మంజూరైన ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలు,ఎంపీ నిధులతో కోటకొండ పంచాయతీ మజరా గ్రామమైన కే. కొత్తూరులో సీసీ రోడ్లు వేయించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

మందలూరు చేరుకున్న పార్వేట పల్లకీ





మందలూరులో పూజలందుకుంటున్న స్వామి వార్లు, రంగురాట్నంలో తిరుగుతూ చిన్నారుల కేరింతలు

రుద్రవరం: అహోబిలేశుడి పార్వేట పల్లకీ పర్యటన మండలంలో రెండో విడత మొదలైంది. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ మండలం జీ.జంబులదిన్నె నుంచి ఆదివారం రాత్రి మండలంలోని మందలూరుకు చేరుకుంది. సోమవారం ఉదయాన్నే గ్రామ సర్పంచ్ నిర్మలమ్మ ,వీఆర్వో ఫకృద్దిన్, గ్రామ పెద్దలు శ్రీనివాసరెడ్డి తదితరులు మేళతాళాలతో పల్లకీకి ఎదురేగి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోకి స్వాగతించారు. అనంతరం పల్లకీ గ్రామంలోని వివిధ తెలుపులపై కొలువు దీరగా ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ పల్లకీ రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్లన్నీ బంధువులు, ఆడపడుచులు, స్నేహితులతో నిండిపోయాయి. ఇక గ్రామంలో వివిధ రకాల దుకాణాలు, రంగురాట్నాలు వెలిశాయి. దీంతో వాటి వద్ద సందడి నెలకొంది.

సమష్టి కృషితో దేవస్థానం అభివృద్ధి



గంగుల మనోహర్‌రెడ్డికి రూ.లక్ష చెక్కును అందజేస్తున్న గోపాల్‌రెడ్డి

ఆళ్లగడ్డ: పాలకమండలి, అభివృద్ధి కమిటీ సభ్యులందరూ సమష్టిగా శ్రీ రామతీర్థ పుట్టాలమ్మ దేవస్థాన అభివృద్ధికి కృషి చేద్దామని క్షేత్ర పాలక మండలి చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో విశిష్టత ఉన్న క్షేత అభివృద్ధికి ప్రత్యేకంగా 20 మంది భక్తులతో అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. మొదటగా శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రాంగణం, రాజగోపురం పునర్నిర్మాణానికి టీటీడీ రూ.80 లక్షలు మంజూరు చేసేదుకు అంగీకారం తెలపిందన్నారు. అయితే దేవస్థానం తరపున 25 శాతం నిధులు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ నిధుల సేకరణకు సభ్యులందరూ దాతల సహాయం తీసుకోవాల్సి అవసరం ఉందన్నారు. ప్రతి నెల కమిటీ సమావేశం నిర్వహించి జమా, ఖర్చుల వివరాలు బహిరంగంగా చర్చించాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం కోట కందుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, కాంట్రాక్టర్ గోపాల్‌రెడ్డి రాజగోపురం నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా ప్రకటించి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి, అభివృద్ధి కమిటీ సభ్యులు గంగిశెట్టి తిమ్మయ్య, గంగుల రామిరెడ్డి, కూలూరు నరసింహారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణాపురం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం కోరారు. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం డీఆర్ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డీఆర్ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులు రాజకీయ వేధింపులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గ్రామాలను శుభ్రం చేస్తూ ప్రజలు అంటురోగాల బారిన పడకుండా సేవలందిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం నాయకులు సుబ్బరాయుడు, దేవదాసు, నాయకులు ప్రసాద్, నాగన్న పాల్గొన్నారు.

25న వేంకటేశ్వర స్వామి కల్యాణం



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

ఆళ్లగడ్డ: చాగలమర్రిలోని వాసవీ కళాశాల ఆవరణలో ఈనెల 25వ తేదీన లోక కల్యాణార్థం శ్రీ దేవీ, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామని చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు తెలిపారు. సోమవారం వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తోట సురేష నరసింహశాస్త్రి, నాగభూషణం, లోకేష్, భార్గవరెడ్డి లక్ష్మీనారయణరెడ్డి ఉన్నారు.

ఘర్షణ..ఒకరికి గాయాలు



బాధితుడిని 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక మద్యం దుకాణం సమీపంలో సోమవారం ఇద్దరు వ్యక్తుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. బెస్త కాలనీకి చెందిన గుట్ట, బ్రహ్మం మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో వ్యక్తిగత విషయాలకు సంబంధించి మాట మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో బ్రహ్మం గాజు సీసాతో గుట్టపై దాడి చేశాడు. గాయపడిన గుట్టను స్థానికులు 108 ద్వారా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు కాలనీ వాసులు తెలిపారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సందర్శన నిమిత్తం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మంగళవారం రానున్నారని, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మల్యాల ఎత్తిపోతల పథకం, పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, సిద్దేశ్వరం, బానకచర్ల, వెలుగోడు ప్రాజెక్టులను పరిశీలిస్తారని చెప్పారు. నాయకులు ప్రసాద్, ధనుంజయుడు, సోమన్న పాల్గొన్నారు.

స్పందనపై నిర్లక్ష్యం తగదు



రెవెన్యూ కార్యాలయంలో స్పందనకు హాజరైన అధికారులు

ఉయ్యాలవాడ : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.అయితే కొందరు అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మిశైలజ,హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మిదేవి, పశు వైద్యాధికారి శైలజ, పంచాయతీరాజ్ ఏఈ రామకృష్ణారెడ్డి, హౌసింగ్ డీఈ నాగరాజు, ఏపీఎం శేఖర్, ఉపాధి ఏపీఓ రవిప్రకాష్ మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్ రవికుమార్ కోర్టు పనుల నిమిత్తం కర్నూలుకు వెళ్లారు. మిగిలిన శాఖల అధికారులు హాజరు కాలేదు.హాజరు కావాలని పలుమార్లు తెలిపినా మార్పు రావడం లేదని, కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

మహానంది ఉత్సవాలకు ఆహ్వానం



జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు ఆహ్వానపత్రిక ఇస్తున్న చైర్మన్, ఈజీ, పండితులు

మహానంది: మహానందిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని సోమవారం పలువురు ప్రముఖులకు ఆహ్వానపత్రికలు అందించినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడులు నంద్యాలకు వెళ్లి ప్రముఖులను కలిశారు. అందులో భాగంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతికి ఆహ్వానపత్రికలు, స్వామి వార్ల ప్రసాదం అందజేసి ఆహ్వానం పలికారు. అలాగే మహాశివరాత్రి తెప్పోత్సవం దాత ఎజీఎస్ జ్యూవెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్, కల్యాణోత్సవ దాత కూరగాయల ప్రసాద్, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి తదితరులకు ఆహ్వాన పత్రికలు అందించారు.

పన్నులు వసూలు చేయాలి

ఆళ్లగడ్డ: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాల్సిన బాధ్యత ఆయా పంచాయతీ కార్యదర్శులదేనని చాగలమర్రి మండల ఈఓపీఆర్డీ నాంగేంద్రయ్య తెలిపారు. చాగలమర్రి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికీ నిబంధనల మేరకు పన్ను వసూలు చేయాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో చాగలమర్రి మేజర్ పంచాయతీ ఈఓ సుదర్శనరావు, గ్రామ పంచాయతీ, గ్రామ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహానందీశుడికి పల్లకీ సేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో కొలువై విహరించారు. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ వైభవంగా జరిగింది. సోమవారం కావడంతో మహానంది క్షేత్రం భక్తులతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి,అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

శివపార్వతులకు పల్లకీ సేవ

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులకు పల్లకీ సేవ సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొటబుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం శ్రీ ఉమామహేశ్వరస్వామికి అభిషేకం,అర్చన తదితర విశేష పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగించారు.

పేద మహిళలకు భూమి ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): అర్హులైన పేద మహిళలకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మూడు ఎకరాల భూమి పంపిణీ చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ కోరారు. 'ఓ మహిళా మేలుకో, మన హక్కుల కోసం ఉద్యమించుదాం' అంటూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలన్నారు. జంబూ ద్వీపం పథకం ద్వారా ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ అగ్ర కులాల పేదలకు 400 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని, కన్నతల్లి బాలికల సంరక్షణ పథకం ద్వారా రూ.2లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలను నిరోధించడానికి పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా తరలివస్తున్న శివస్వాములు, భక్తులు



శ్రీశైల క్షేత్రం భక్తజనసంద్రం



శివోహం

- ఇలకైలాసంలో ఆధ్యాత్మిక సంబరాలు
- బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తరలివస్తున్న భక్తజనం
- ఓంకార నాదంతో..మారుమోగుతున్న శ్రీగిరులు
- స్వామిఅమ్మవార్లను దర్శించి తరిస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఎక్కడ చూసినా శివనామస్మరణ, శివభజనలు భక్తుల ఆధ్యాత్మికంగా పూజాధికాలతో ఇలకైలాసమైన శ్రీగిరి ఆధ్యాత్మిక సంబరాలు కొనసాగుతున్నాయి. అత్యంత వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను కనులారా తిలకించి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని భక్తజనం తండోపతండాలుగా శ్రీగిరికి చేరుకుంటున్నారు. ఓంకార నాదంతో శ్రీగిరులు మారుమోగుతున్నాయి.

భారీగా తరలివచ్చిన భక్తులు

శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులు దీరారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసింది. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్నారు. శివదీక్షా భక్తులకు ప్రత్యేకంగా చంద్రవతి కల్యాణ మండపం నుంచి క్యూలైన్ ఏర్పాటు చేశారు. జ్యోతిర్ముడి కలిగిన శివదీక్షా భక్తులకు సమయానుకూలంగా మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తున్నారు. క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు అల్పాహారం, మంచినీరు, బిస్కెట్లు, అందజేస్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లన్నీ నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, దేవస్థాన ఈఓ ఎస్.లవన్న ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తున్నారు.

ఉచిత దర్శనానికి 3 గంటలు, శీఘ్ర దర్శనానికి గంట..

ఉచిత దర్శనానికి 3గంటల సమయం, శీఘ్ర దర్శనానికి గంట సమయం పడుతుంది. భక్తుల రద్దీతో ఆలయ ప్రధానవీధులన్నీ కళకళలాడుతున్నాయి. దీంతో శ్రీశైల క్షేత్రంలో బ్రహ్మోత్సవ సందడి నెలకొంది. క్షేత్రపరిధిలో పలుచోట్ల భక్తులు, శివస్వాములు పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు, భజనలు చేస్తూ క్షేత్ర ఆధ్యాతిక శోభ మరింత పెంచుతున్నారు.

నల్లమల అడవుల్లో ఓంకార నాదం

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పలువురు భక్తులు పాదయాత్రగా తరలివస్తున్నారు. శివమాల స్వీకరించిన భక్తులే కాకుండా సాధారణ భక్తులు సైతం వెంకటాపురం నుంచి పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటున్నారు. నల్లమల అటవీప్రాంతంలో భక్తులు శివనామస్మరణ చేసుకుంటూ తమ పాదయాత్రను సాగిస్తున్నారు. దీంతో నల్లమల అటవీ ప్రాంతంలో ఓంకారనాదం ప్రజ్వలిస్తుంది.